

బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707


తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT









సంపుటి: 1 సంచిక: 147 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ మంగళవారం 31-12-2024 వెల: 5/రూ -


# స్కిల్స్ వర్సిటీ.. అద్భుత ఆలోచన

## ఇది తెలంగాణను మరో స్థాయికి తీసుకెళ్తుంది

- నైపుణ్యాలు, మౌలిక వసతులతోనే ఆర్థికాభివృద్ధి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టుల్లో భాగస్వాములవుతాం
- సీఎం రేవంత్‌తో మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల
- ఏఐ, క్లౌడ్ రంగాల్లో సహకరించాలన్న సీఎం
- ఏఐ ప్రాజెక్టులపై ప్రజెంటేషన్ ఇచ్చిన శ్రీధర్‌బాబు
- సత్య నాదెళ్ల నివాసంలో గంటకుపైగా భేటీ



హైదరాబాద్, "ప్రస్తుత, భవిష్యత్తు పారిశ్రామిక అవసరాలకు సరిపడా నైపుణ్యాలను సాధించడంపైనే యువత ఉపాధి అవకాశాలు ఆధారపడి ఉంటాయి. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలపైనే ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. అందుకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆకట్టుకున్నాయి" అని మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల అన్నారు. హైదరాబాద్ వచ్చిన సత్య నాదెళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌లు ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సత్య నాదెళ్లతో

- మిగతా 2వ పేజీలో

### తెలంగాణ గుండెల్లో.. కలకాలం మన్మోహన్

- ప్రధానమంత్రిగా.. రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్ ఆయన
- సోనియాగాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చిన గొప్ప నాయకుడు
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం
- శాసనసభలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

2లో



2లో


### డాకింగ్ దిశగా... ఇస్రో తొలి అడుగు

- పీఎస్ఎల్‌వీ ప్రయోగం విజయవంతం
- నిర్ధారిత కక్ష్యలోకి స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు
- జనవరి 7న డాకింగ్ ప్రక్రియ: ఇస్రో
- సఫలమైతే నాలుగో దేశంగా రికార్డు
- గగన్‌యాన్, భావి మిషన్లకు కీలకం

### త్రీడీ, కేడీ రేవంత్‌కు మోదీ మద్దతు

- రాష్ట్ర సర్కార్‌కు రక్షణ కవచంలా బీజేపీ
- కావాలనే అల్లు అర్జున్‌ను టార్గెట్ చేశారు
- సెటిల్మెంట్ తర్వాత ఏమీ మాట్లాడట్లేదు
- ఢిల్లీలో పీవీ స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలి: కేటీఆర్

2లో



## కమీషన్లు ఇస్తేనే బిల్లుల మంజూరు

- రాష్ట్రంలో మంత్రుల మధ్య అంతర్యుద్ధం
- సీఎం రేవంత్‌కు, అల్లు అర్జున్‌కు ఎక్కడో చెడింది
- రేవంత్‌లో గొప్ప నాయకుడు ఎలా కనిపించారో.. పవన్ కల్యాణ్‌కే తెలియాలి: కేంద్ర మంత్రి సంజయ్

2లో

కరీంనగర్,:కాంగ్రెస్ ప్రభుత్వంలో కమీషన్లు ఇస్తేనే బిల్లులు మంజూరవుతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పించాలని కోరుతూ తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం

## గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు

2లో

### తొక్కిసలాట ఘటన బాధాకరం

- అల్లు అర్జున్ తరఫున వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించాల్సింది
- క్షమాపణలు చెబితే బాగుండేది.. సమస్య పెద్దది అయ్యేది కాదు
- రేవంత్‌రెడ్డి కక్షసాధింపులకు పోలేదు.. ఎవరున్నా అలాగే చేసుండేవారు
- సమస్య పరిష్కారంలో సినిమా టీమ్ ఫెయిల్.. హీరోను ఒంటరిని చేశారు
- సంధ్యా థియేటర్ ఘటనపై మీడియాతో డిప్యూటీ సీఎం పవన్



అమరావతి: హైదరాబాద్‌లో సంధ్యా థియేటర్ వద్ద పుష్ప-2 బెనిఫిట్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన, అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొదటిసారి స్పందించారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తీసుకువచ్చారని వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ సమానమేనని అన్నారు. సంఘటన జరిగిన వెంటనే అల్లు అర్జున్ తరఫున బాధిత

- మిగతా 2వ పేజీలో


# జలంతో జయం

- 3 ఏళ్లు.. 80,112 కోట్ల వ్యయం
- అక్కడి నుంచి బొల్లాపల్లి వరకు
- రెండో దశలో 150 టీఎంసీల ఎత్తిపోత
- దీని అంచనా వ్యయం 28,560 కోట్లు
- మూడో దశలో బనకచర్లకు తరలింపు
- 38,014 కోట్లతో రోజుకు 2 టీఎంసీలు
- మొత్తంగా 368 కి.మీ. ప్రయాణం

2లో

కృష్ణా నదిలో నీళ్లు తగ్గాయి. గోదావరిలో 4,114 టీఎంసీల వరద సముద్రంపాలవుతోంది. నదుల అనుసంధానంతో ఇందులో కనీసం కృష్ణాకు 200 టీఎంసీలను తరలించినా కరువు, వరదలను ఎదుర్కోవచ్చు. బనకచర్లకు గోదావరి నీటిని తీసుకువెళ్లగలిగితే.. రాష్ట్రంలో అంతర్గతంగా నదుల అనుసంధానం పూర్తయినట్లే. తెలుగు తల్లికి జలహారతి ఇచ్చినట్లే!

– ముఖ్యమంత్రి చంద్రబాబు




అమరావతి,: గోదావరి-బనకచర్ల అనుసంధానంతో కరువును శాశ్వతంగా జయించి... రాష్ట్రానికి జల భద్రత కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మూడేళ్లలో రూ. 80,112 కోట్లతో గోదావరి-బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ అనుసంధానం పూర్తిచేసేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 'తెలుగు

- మిగతా 2వ పేజీలో

## గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు

(మొదటిపేజీ తరువాయి)



కుటుంబం వద్దకు వెళ్లి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వైసీపీ విధానాల తరహాలో వ్యవహరించలేదన్నారు. రేవంత్ రెడ్డి గట్టి నాయకుడని, కిందిస్థాయి నుంచి ఎదిగారని ప్రశంసించారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన ముచ్చటించారు. "అల్లు అర్జున్ థియేటర్‌కు వెళ్లే ముందు తగిన ఏర్పాట్లు చేసుకుని ఉండాల్సింది. హీరో అభివాదం చేయకపోతే పొగరని అనుకుంటారు. అభివాదం చేయడం ఎంజాయ్ చేయడం కాదు.. అభిమానులకు భరోసా కల్పించడం. తొక్కిసలాట ఘటన బా?ధాకరమైనది. అల్లు అర్జున్ థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు ఆయనకు సిబ్బంది చెప్పి ఉండాల్సింది. సంఘటన జరిగిన వెంటనే బాధితుల కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి వారిని ఓదార్చాల్సిన అవసరం ఉంది. హీరో తరఫున ఎవరో ఒకరు వెళ్లి ఉంటే సమస్య పెద్దది అయ్యేది కాదు. మా ప్రమేయం లేకుండా తప్పు జరిగిపోయిందని చెప్పి, క్షమాపణలు కోరాల్సింది. ఓదార్చే సమయంలో ఒక్కసారి మనం తిట్లు కూడా తినాల్సి వస్తుంది. సినిమా నిర్మాత, డైరెక్టర్ పరామర్శించ లేదు. అదే పెద్ద లోపంగా కనిపిస్తోంది. ఎక్కడో మానవతా దృక్పథం లోపించింది. సమస్య పరిష్కారంలో టీమ్ ఫెయిలైంది. హీరోపైనే నిందలు వేయడం కూడా కరెక్టు కాదు. దీనిని టీమ్‌గా తీసుకోవాలి. సినిమానే కాదు సమస్యనూ టీమ్‌గా తీసుకోవాలి. సమస్యను హీరోపై పెట్టి ఒంటరి వ్యక్తిని చేసేశారు. అది కరెక్టుగా అనిపించలేదు. ఆ తర్వాత జరిగిన వ్యవహారంలో అల్లు అర్జున్‌ను ఎవరూ సరిగా గైడ్ చేయలేదు" అని పవన్ అన్నారు.

**రేవంత్ కక్షసాధింపులకు పోలేదు**

'సినిమా చూడడానికి వచ్చి ప్రాణాలు కోల్పోవడం బా?ధాకరం. పోలీసులను మనం ప్రశ్నించలేం. నేను థియేటర్‌కు వెళ్లను. చిరంజీవి కూడా ముసుగు వేసుకుని థియేటర్‌కు వెళ్లేవారు. అభిమానులు భారీ వస్తారు కాబట్టి, హీరో థియేటర్‌కు వెళ్లే సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటన తర్వాత సీఎం హోదాలో రేవంత్ రెడ్డి స్పందించారు. అక్కడ ఎవరున్నా రేవంత్‌రెడ్డి అలానే చేసేవారు. రేవంత్ రెడ్డి ఆ సినిమాకు అన్ని రకాలుగా సహకరించారు. బెనిఫిట్ షో అవకాశం కల్పించారు. టికెట్ల రేట్లు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చారు. జగన్‌లా నిలిపేసి, కక్షసాధింపు చేయలేదు..' అని పవన్ అన్నారు.

## కమీషన్లు ఇస్తేనే బిల్లుల మంజూరు

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు కరీంనగర్‌లో సోమవారం బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ బిల్లు మంజూరు చేయాలన్నా 8 నుంచి 14 శాతం కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో కొందరు నిజాయితీపరులైన మంత్రులు ఉన్నారని, కమీషన్ల విషయం వారికి ఏమాత్రం నచ్చడం లేదన్నారు. బిల్లులు, కమీషన్ల విషయంలో మంత్రుల మధ్య అంతర్యుద్ధం జరుగుతోందని దుయ్యబట్టారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టడంపై ఉన్న శ్రద్ధ .. సమస్యల పరిష్కారంపై లేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వేలమంది మాజీ సర్పంచ్‌లకు రూ.1300కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. వీరి పక్షాన బీజేపీ ఉద్యమిస్తుందని, కాంగ్రెస్ మెడలు వంచి బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు తీరు వల్లే నేరాలు పెరిగాయని సంజయ్ విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు 28 శాతం పెరిగాయని, రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడలేని చేతగాని సర్కార్ ఉందని దుయ్యబట్టారు.

# స్కిల్స్ వర్సిటీ.. అద్భుత ఆలోచన

(మొదటిపేజీ తరువాయి)

గంటకు పైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీతోపాటు నగరంలో 200 ఎకరాల్లో నిర్మించబోయే ఏఐ సిటీ, ప్రభుత్వ శాఖల్లో ఏఐ సాంకేతికత, ఈ రంగంలో ఉపాధి అవకాశాలపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఐటీ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యం, నగరంలో ఏర్పాటవుతున్న అంతర్జాతీయ ఐటీ కంపెనీల వివరాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను సత్య నాదెళ్ల ప్రశంసించారు. ఉపాధి అవకాశాలు పెంచడంలో స్కిల్స్ వర్సిటీ తెలంగాణను మరోస్థాయికి తీసుకెళు తుందన్నారు. పరిశ్రమల భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేయడం అద్భుతమైన ఆలోచన అని కొనియాడారు. స్కిల్స్ వర్సిటీతోపాటు యువత నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్ సహకారం ఉంటుందని సత్య నాదెళ్ల సీఎం రేవంత్‌రెడ్డికి హామీ ఇచ్చారు. నైపుణ్యాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ 50 నగరాల్లో ఒకటిగా నిలుపుతాయని అభిప్రాయపడ్డారు.

**ఏఐ, జెన్ ఏఐ, క్లౌడ్ రంగాల్లో సహకరించండి: సీఎం రేవంత్**


హైదరాబాద్‌లో ఏర్పాటైన తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని, ప్రస్తుతం నగరంలో 10 వేల మందికి పైగా ఉపాధి కల్పిస్తోందని సీఎం రేవంత్ అన్నారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పెట్టుబడులను విస్తరిస్తున్నందుకు సత్య నాదెళ్లకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏఐ, జెన్ (జెనరేటివ్) ఏఐ, క్లౌడ్ రంగాలను ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందని, దీనికి మైక్రోసాఫ్ట్ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. నగరంలోని మేకగూడ, షాద్‌నగర్, చందన్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ మూడు డేటా సెంటర్లను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇవి కొన్ని నెలల్లో అందుబాటులోకి



రానున్నాయి. దీనిపైనా సమావేశంలో చర్చ జరిగింది. త్వరగా వీటి నిర్మాణ పనులను పూర్తి చేస్తామని సత్య నాదెళ్ల అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

# డాకింగ్ దిశగా... ఇస్రో తొలి అడుగు

సూళ్లూరుపేట: అంతరిక్షంలో ఉపగ్రహాల అనుసంధానం, విడదీత సామర్థ్యాన్ని సమకూర్చుకునే దిశగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వేసిన తొలి అడుగు విజయవంతమైంది. స్పేస్ డాకింగ్ ప్రయోగం (స్పేడెక్స్)లో భాగంగా ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ%-%సీ60 రాకెట్ సోమవారం విజయవంతంగా నిర్ధారిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దాంతో ప్రయోగంలో తొలి అంకం దిగ్విజయమైంది. అతి కీలక మైలురాయికి ఇస్రో కేవలం అడుగు దూరంలో నిలిచింది. రెండో దశలో జంట ఉపగ్రహాలను అంతరిక్షంలో అనుసంధానం (డాకింగ్) చేయడం స్పేడెక్స్ మిషన్ ప్రధాన లక్ష్యం. ఈ ప్రక్రియ జనవరి 7న జరగవచ్చని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. అది సఫలమైతే అమెరికా, చైనా, రష్యా తర్వాత అతి సంక్లిష్టమైన డాకింగ్ టెక్నాలజీ కలిగిన నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది. ఇస్రో నిర్వహించబోయే మానవ సహిత గగన్‌యాన్, చంద్రయాన్%-%4 ప్రయోగాలతో పాటు భారతీయ స్పేస్ స్టేషన్ నిర్మాణం తదితరాల్లో ఈ టెక్నాలజీది కీలక పాత్ర కానుంది. ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఏపీ సీఎం మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వెలిబుచ్చారు.



**ఇలా జరిగింది...**


ప్రయోగం ముందు నిర్ణయించినట్టు సోమవారం రాత్రి 9.58కు బదులు 2 నిమిషాల ఆలస్యంగా పదింటికి జరిగింది. 25 గంటల కౌంట్‌డౌన్ అనంతరం రెండు ఉపగ్రహాలతో పీఎల్ఎల్వీ%-%సి60 తిరుపతి జిల్లా సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని తొలి ప్రయోగవేదిక నుంచి నింగికెగిసింది. మామూలుగా 320 టన్నులుండే పీఎస్ఎల్‌వీ రాకెట్ స్ట్రాపాన్ బూస్టర్లు లేకపోవడంతో 229 టన్నులతోనే దూసుకెళ్లింది. 111.12 సెకన్లకు తొలి దశ, 262.06 సెకన్లకు రెండో దశ, 511.22 సెకన్లకు మూడో దశ, 792.48 సెకన్లకు నాలుగో దశ విజయవంతంగా పూర్తయ్యాయి. 15.15 నిమిషాలకు టార్గెట్, 15.20 నిమిషాలకు ఛేజర్ ఉపగ్రహాలను 470 కి.మీ. ఎత్తులో నూతన సెమీ మేజర్ యాక్సిస్ వృత్తాకార కక్ష్యలో 55 డిగ్రీల వాలులో విజయవంతంగా ప్రవేశపెట్టారు. తర్వాత పీఎస్%-%4లో అమర్చిన పలు స్టార్టప్ కంపెనీలకు చెందిన 24 పేలోడ్లను కూడా కక్ష్యలోకి ప్రవేశపెట్టడంతో ప్రయోగం పూర్తయింది. 2024లో చివరిదైన ఈ ప్రతిష్టాత్మక ప్రయోగం విజయవంతం కావడంతో సైంటిస్టుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. షార్ కేంద్రం నుంచి ఇది 99 ప్రయోగం. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో 62వది. వాటిలో 60 విజయాలే కావడం విశేషం!

**వారంలోనే పని మొదలు**

స్పేడెక్స్ ఉపగ్రహాలు వారంలోనే పని చేయడం ప్రారంభిస్తాయని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్ చెప్పారు. సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ సందర్శన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "2025 మార్చిలోపు రెండు పీఎస్ఎల్వీ, ఒక జీఎస్ఎల్వీ, రెండు ఎల్‌వీఎం3 రాకెట్ ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకున్నాం. గగన్‌యాన్ ప్రయోగమూ వీటిలో ఉంది" అని వివరించారు.

**స్పేడెక్స్ ఉపయోగాలెన్నో...**

స్పేడెక్స్ జంట ఉపగ్రహాలను ఇస్రో పూర్తిగా సొంత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించింది. ఒక్కోదాని బరువు 220 కిలోలు. ఇవి రెండేళ్ల పాటు సేవలందిస్తాయి. వీటి అనుసంధానం సాంకేతికంగా అత్యంత సవాలుతో కూడింది. అత్యంత వేగంగా ప్రయాణించే రెండు ఉపగ్రహాలు వేగాన్ని నియంత్రించుకుంటూ క్రమంగా పరస్పరం చేరువవుతూ సున్నితంగా అనుసంధానం కావాలి. ఏమాత్రం తేడా వచ్చినా ఢీకొని పేలిపోతాయి.





## తెలంగాణ గుండెల్లో.. కలకాలం మన్మోహన్

హైదరాబాద్, : మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పురస్కారమైన భారత రత్నను ప్రదానం చేయాలని తెలంగాణ శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయన మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించడానికి సోమవారం శాసనసభ ప్రత్యేకంగా సమావేశమైంది. ఇందులో మన్మోహన్‌కు భారత రత్న పురస్కారం ప్రదానం చేయాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టి సీఎం రేవంత్ ప్రసంగించారు. "మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసిన నాయకుడు. ప్రధాని హోదాలో తెలంగాణకు రాష్ట్ర హోదా కల్పించారు. తెలంగాణతో ఆయన అనుబంధం విడదీయలేనిది. పార్లమెంటు ఉభయ సభల్లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందేలా చేసిన, రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్‌గా మన్మోహన్ సింగ్‌ను తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది" అని అన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ ఇచ్చిన మాటను పార్లమెంట్ ప్రక్రియ ద్వారా నెరవేర్చే బాధ్యత తీసుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు.

# జలంతో జయం

(మొదటిపేజీ తరువాయి)

తల్లికి జలహారతి' పేరిట చేపట్టనున్న ఈ ప్రాజెక్టు గురించి సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో మీడియాకు ఆయన వివరించారు. బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ రాయలసీమకు గేట్‌వేగా మారుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికే గేమ్ చేంజర్ అవుతుందని చెప్పారు.ఐఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ పథకం గురించి వివరించానన్నారు. దీనికి ఇప్పటి ధరల ప్రకారం రూ.80,112 కోట్లవుతుందని అంచనా వేసినట్లు వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం అందించే ప్రతిపాదనల ఆధారంగా.. ప్రాజెక్టుకు నిధులు ఎలా విడుదల చేయాలో ఆలోచిస్తామని ఆమె చెప్పారన్నారు. ఈ పథకాన్ని మరో పదేళ్లు ఆలస్యం చేస్తే .. ఖర్చు మూడింతలు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు కలసి హైబ్రిడ్ విధానంలో అమలు చేయాలన్న యోచనలో ఉన్నామని ఆమెకు చెప్పినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల కొత్తగా ఏడున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందన్నారు. ఇంకా ఏం చెప్పారంటే..

**నిర్మాణం ఇలా..**

తెలుగుతల్లికి జలహారతి ప్రాజెక్టును మూడు దశల్లో చేపడతాం. గోదావరి జలాలను తొలి దశలో రూ.13,511 కోట్లతో 187 కిలోమీటర్ల మేర పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిపోస్తాం. ఇందుకోసం కుడికాలువను 38,000 క్యూసెక్కుల స్థాయికి విస్తరిస్తాం. మార్గమధ్యంలో ఒక లిఫ్టును నిర్మిస్తాం. పది సొరంగాలను నిర్మిస్తాం. అక్కడి నుంచి రెండో దశలో రూ.28,560 కోట్ల అంచనా వ్యయంతో బొల్లాపల్లి రిజర్వాయరులోకి 150 టీఎంసీలు ఎత్తిపోస్తారు. ఇందుకోసం కాలువను 24 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరిస్తాం. ఆరు లిఫ్టులు పెట్టి 84 కిలోమీటర్ల మేర జలాలు తరలిస్తాం. మూడో దశలో రూ.38,014 కోట్లతో బొల్లాపల్లి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు రోజుకు రెండు టీఎంసీల చొప్పున 300 టీఎంసీలు ఎత్తిపోస్తాం. మూడు లిఫ్టులతో 108.4 కిలోమీటర్లు తీసుకెళ్తాం. మొత్తంగా పది లిఫ్టులతో 368 కిలోమీటర్ల వరకు గోదావరి జలాలను తరలిస్తాం. 48,000 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంటుంది. రూ.80,112 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టును కేంద్రమే పూర్తిగా భరించేలా లేదు. అందువల్ల కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు, ప్రైవేటు భాగస్వామ్యంతో హైబ్రిడ్ విధానంలో నిర్మిస్తాం. మూడు నెలల్లో ఈ పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)తో కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతాం. అక్కడి నుంచి అనుమతి వచ్చాక ఇంకో 2-3 నెలల్లో టెండర్లు పిలుస్తాం. ఈ ప్రాజెక్టులో భాగంగా గ్రీన్ ఎనర్జీ అమలు దిశగా పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్, సౌర విద్యుత్, పవన విద్యుత్ పథకాలను అమలు చేస్తాం. బొల్లాపల్లి నుంచి వెలిగొండకు కూడా తరలిస్తాం.

**గోదావరి-కావేరితో లాభం లేదు**

కేంద్రం ప్రతిపాదించిన గోదావరి-కావేరి అనుసంధాన పథకం వల్ల రాష్ట్రానికి ప్రయోజనం లేదు. మన రాష్ట్రంలోని నదులను అనుసంధానిస్తే ఆంధ్రను సస్యశ్యామలం చేయవచ్చు. రాష్ట్రంలో రిజర్వాయర్ల సామర్థ్యం 983 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం వాటిలో 729 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. జనవరి ఒకటో తేదీకి రిజర్వాయర్లలో 74 శాతం నీళ్లు ఉండడం రికార్డు. తెలుగు రాష్ట్రాల్లో 90 శాతం ప్రాజెక్టులు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి.

పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పనులు జనవరి రెండో తేదీన ప్రారంభమవుతాయి. ప్రాజెక్టు క్షేత్రంలో చేపట్టే ఈ కార్యక్రమంలో నేనూ పాల్గొంటా.

## త్రీడీ, కేడీ రేవంత్‌కు మోదీ మద్దతు

హైదరాబాద్, : "ప్రభుత్వ వైఫల్యాలు బయటపడకుండా.. తెలంగాణ ప్రజలను ఎప్పటికప్పుడు మభ్యపెట్టేలా రేవంత్‌రెడ్డి సర్కార్ త్రీడీ వ్యూహంతో ముందుకెళ్తోంది. డిస్ట్రక్షన్ (విధ్వంసం), డైవర్షన్ (దారిమళ్లించడం), డిస్‌ట్రాక్షన్ (జనం దృష్టి మళ్లించడం)తప్ప.. పాలన చేతగాదు. ఇలాంటి కేడీ రేవంత్‌రెడ్డికి మోదీ మద్దతుగా నిలుస్తున్నారు. అమృత్ టెండర్ల గోల్‌మాల్, పౌరసరఫరాల శాఖలో కుంభకోణం, మూసీ సుందరీకరణ, హైడ్రా పేరిట అక్రమాలు వంటి అంశాలపై తాము ఫిర్యాదు చేసినా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక ఉద్దేశం ఏంటి? తప్పులను ప్రశ్నించకపోగా... కేంద్ర మంత్రులు, ఇక్కడి బీజేపీ ఎంపీలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రక్షణ కవచంగా నిలుస్తున్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. రెండు జాతీయ పార్టీలు కుమ్మక్కై తనను కేసుల్లో ఇరికించాలని చూస్తున్నాయని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు తాను భయపడేది లేదన్నారు. ఫార్ములా-ఈ రేసింగ్‌కు హెచ్ఎండీఏ ద్వారా డబ్బులు చెల్లించామని, ఇందులో ఎక్కడా అవినీతి జరగలేదని స్పష్టం చేశారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగానే అత్యుత్సాహంతో ఈడీ నోటీసులు ఇచ్చిందని ధ్వజమెత్తారు. ఏదేమైనా ఈ అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామని వెల్లడించారు. హామీల అమలుపై ప్రజల దృష్టి మళ్లించేందుకే.. హీరో అల్లు అర్జున్‌ను ప్రభుత్వం టార్గెట్ చేసిందని ధ్వజమెత్తారు. సినిమా వాళ్లతో నిర్వహించిన సమావేశంలో సెటిల్మెంట్ చేసుకొని, ఆ అంశంపై ఏమీ మాట్లాడటం లేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అటకెక్కించడం ద్వారా ప్రజలను సర్కారు వంచించిందని ధ్వజమెత్తారు. ఇప్పుడు 2025 సంక్రాంతికి మరో సారి మోసగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై కోర్టులో కేసు వేయించడం ద్వారా.. పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించే కుట్ర జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై సీఎం, మంత్రులు ఎవరికి ఇష్టంవచ్చినట్లు వారు లెక్కలు చెబుతున్నారని, ఇప్పటికైనా అందరూ మాట్లాడుకొని ఒకే అబద్ధం చెప్పాలని వ్యాఖ్యానించారు. ఎప్పుడు ఏం చేయాలో తమ పార్టీ అధినేత కేసీఆర్‌కు తెలుసని, సమయం వచ్చినపుడు ఆయన బయటకు వస్తారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ కోసం 24ఏళ్లు కష్టపడిన వ్యక్తి.. కొంతకాలం విశ్రాంతి తీసుకుంటే తప్పేముందని ప్రశ్నించారు.

## కొత్త సంవత్సరం వేడుకల పేరుతో ప్రజాశాంతికి

# భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం

### సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలి.

**జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 30, 31 రెండు రోజుల పాటు విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీలు.**

**డిసెంబర్ 31 రోజుల డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లలో పట్టుబడితే జైలుకే.**

**మైనర్లు వాహనాలు నడుపుతూ, పట్టుబడితే అట్టి వాహన యజమానిపై కేసులు నమోదు.**

**నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా డీజేలు, అధిక శబ్దం వచ్చే బాక్స్ లు వినియోగిస్తే ఉపేక్షించేది లేదు..**

**జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్**

**సంగారెడ్డి బ్యూరో డిసెంబర్ 30(డైలీ రిపోర్ట్):** నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజల శాంతి, భద్రతలకు విఘాతం కలిగించడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. 31 డిసెంబర్ వేడుకలకు సంబంధించి, ఎలాంటి అక్రమ మద్యం రవాణా జరగకుండా ఇప్పటికే వాహనాల తనిఖీలు ప్రారంభించడం జరిగిందని, డిసెంబర్ 31 రోజు సాయంత్రం పోలీస్ బృందాలు విస్తృత స్థాయిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేస్తాయని, పట్టణ ప్రాంతాలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాలలో రోడ్లపై తనిఖీలు ఉంటాయని తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. నూతన సంవత్సర వేడుకలకు, పార్టీలకు, డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని, పెద్ద శబ్దాలతో కూడిన డీజేలు, మైకులు ఏర్పాటు చేస్తే డీజేలను సీజ్ చేసి, సంబధిత వ్యక్తులపై చట్టరిత్య చర్యలు తీసుకోవడం జరుగతుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఇట్టి విషయాల్లో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే సంబందిత వాహన, కుటుంబ సభ్యులపై కూడా చర్యలు తప్పవని ఎస్పీ గారు హెచ్చరించారు.నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా నిర్వహించుకునే ఎలాంటి కార్యక్రమాలైన తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలని, అలాగే ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, అధిక శబ్దం వచ్చే బాక్స్ లు ఏర్పాటు చేస్తే ఉపేక్షించేది లేదని, అట్టి వ్యక్తులపై చట్ట రిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.




### జిల్లా ప్రజలకు పోలీసు వారి సూచనలు..

- జిల్లా వ్యాప్తంగా 30, 30%ఖ% పోలీసు యాక్ట్ అమలులో ఉందని, పోలీసుల ముందస్తు అనుమతిలేనిది, ఎలాంటి సభలు, సమావేశాలు, నైట్ పార్టీలు నిర్వహించరాదు.
- డిసెంబర్ 31 అర్ధ రాత్రి పెద్ద శబ్దాలతో కూడిన డీజేలు, మైకులు, టపాసులు కాల్చి ఇతరులను ఇబ్బందులకు గురిచేయరాదు
- జిల్లా వ్యాప్తంగా డీజేలు నిషేధం, నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేయడం జరుగుతుంది.
- మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు ఇష్టానుసారంగా వేగంగా, సౌండ్స్ చేస్తూ నడిపితే కేసులు నమోదు చేయడం జరుగుతుంది.
- మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే అట్టి వ్యక్తులపై చట్ట రిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- న్యూఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గంజాయి వంటి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మితే షాప్ యాజమానులపై కేసు నమోదు చేయడం జరుగుతుంది.

బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవించకూడదు.

- పైన తెలుపబడిన సూచనలను ఎవరైన ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739 కు సమాచారం అందించవలసిందిగా సూచించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలన్నారు. గడిచిన సంవత్సరానికి వీడ్కోలు చెపుతూ.. నూతన ఆశయాలతో కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ.. ఆనందోత్సాహాలతో, తగిన జాగ్రత్తలతో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రజలకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఇందిరా మహిళా శక్తి ద్వారా సంచార చేపల విక్రయ వాహనాలు

హైదరాబాద్: మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సంచార చేపల విక్రయ వాహనాలను సమకూర్చుతోంది. మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశా లతో ఈ వాహనాలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సిద్ధం చేస్తోంది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల ద్వారా పలు వ్యాపారాలను ప్రారంభింపజేయనున్నారు. జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 32 వాహనాలను మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా తయారు చేయి స్తున్నారు. ఒక్కో వాహనానికి రూ. 10 లక్షలు ప్రభుత్వం సమకూరుస్తోంది. జనవరి 3న వాహనాలను మంత్రి సీతక్క ప్రారంభించను న్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి మత్స్య యోజన పథకంతో అనుసంధానం చేసి.. 60 శాతం సబ్సిడీతో రూ. 4 లక్షలకే మహిళా సంఘాలకు ఈ వాహనాలు అందజేస్తారు. ఈ సబ్సిడీ మొత్తాన్ని సైతం బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలుగా సెర్ప్ ఇప్పించనుంది. గచ్చిబౌలిలోని నిథమ్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళా సంఘాల సభ్యులకు సంచార చేపల విక్రయానికి సంబంధించిన శిక్షణను సెర్ప్ ఆధ్వర్యంలో ఉచితంగా అందించనున్నారు.

## దేశ ఆర్థిక వ్యవస్థకు దవ,దిశ చూపిన దార్శనికుడు

**మన్మోహన్‌కు నివాళి కార్యక్రమంలో హరీష్ రావు.. స్కిల్ వర్సిటీకి పివి పేరు పెట్టాలని డిమాండ్**

హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థకు దశ, దిశ చూపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయనపై పీవీ నరసింహా రావు పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయలేదని చెప్పారు. లైసెన్స్ రాజ్, పర్మిషన్ రాజ్, కోటా రాజ్ విధానాలకు మన్మోహన్ స్వస్తి పలికారని తెలిపారు. అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సభ నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. యూపీఏ హయాంలో ఎన్నో కుంభకోణాలు జరిగినట్లు వార్తలొచ్చాయి. కానీ ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌పై ఒక్క అవినీతి ఆరోపణ రాలేదని గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ జీవితం దేశ సేవలో ధన్యమైందని చెప్పారు. ఆయన సేవలను గుర్తుంచుకునేలా ప్రభుత్వాలు ఏం చేసినా బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. పీవీ ఖ్యాతిని చాటేలా బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందని, స్కిల్ వర్సిటీకి నరసింహారావు పేరు పెట్టాలని ప్రతిపాదించారు. భారత రత్నకు మన్మోహన్ సింగ్ 100 శాతం అర్హులేనని చెప్పారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ఇవ్వాలని బీఆర్ఎస్ కోరుతున్నదని తెలిపారు. గతంలో పీవీకి భారత రత్న ఇవ్వాలని బీఆర్ఎస్ తీర్మానించిందని, దానికి అనుగుణంగా కేంద్రం దేశ అత్యున్నత పౌర పురస్కారం ఇచ్చిందని గుర్తుచేశారు. గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను బాగుచేసేందుకు పీవీ-మన్మోహన్ ద్వయం కృషి చేసిందని



వెల్లడించారు. 1996లో కాంగ్రెస్ ఓటమికి ఆర్థిక సంస్కరణలూ కారణమని ఓ కమిటీ నివేదిక ఇచ్చిందని, దానిని చూసిన మన్మోహన్ సింగ్ కంటతడి పెట్టారని పేర్కొన్నారు. మన్మోహన్ భౌతికంగా లేకున్నా ఆయన చేసిన సేవలు ఎప్పటికీ ఉంటాయన్నారు. విదేశాల్లోనూ ఆయనకు ఉన్నత ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వాటికంటే దేశమే ముఖ్యమని చాటిన గొప్ప వ్యక్తి మన్మోహన్ అని చెప్పారు. ఆయన ఎప్పుడూ పదవుల కోసం చూడలేదని, పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. మన్మోహన్ సంతాప తీర్మానాన్ని మండలిలోనూ పెట్టి ఉంటే బాగుండేదని చెప్పారు.



## 'నూతన' వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్ఐ గోపాల్

నిడమనూరు (నల్గొండ జిల్లా): ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవాలని నిడమనూరు ఎస్ఐ గోపాల్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి బండి నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. రోడ్లపై కేక్ కటింగ్, మద్యం సేవించి అల్లర్లకు పాల్పడడం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాలలో డీజేలు, సౌండ్ సిస్టంలు వినియోగిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి బృందాలుగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు.



## అసంపూర్తిగా ఉన్న సింగాపూర్ రోడ్డు పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కు బిజెపి నాయకుల వినతి

**శంకర్‌పల్లి డిసెంబర్ 30:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 1,9,10 సింగపురం వార్డుల పరిధిలో రెండు వరుసల ప్రధాన రహదారి రోడ్డు వాగు వరకు వేశారు. అసంపూర్తిగా ఉన్న మిగిలిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని సింగాపురం బిజెపి కార్యకర్తలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వర్షం పడిన సమయంలో బురదలో నుండి ప్రయాణించాల్సిన అవసరం ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు, పాదాచారులు రోడ్డుపై గుంతల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ కొంత భాగం రోడ్డు సమస్యను తీర్చాలని కమిషనర్ ను కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో వార్డుల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విదేశీ వ్యామోహంలో యువత చెడిపోవద్దు

**తెలంగాణ రాష్ట్ర గోరక్ష దళ్ మెంబర్ రాఘవేందర్**




**చేవెళ్ల డిసెంబర్ 30:(డైలీ రిపోర్ట్):** విదేశీ వ్యామోహంలో పడి యువత చెడి పోవద్దని తెలంగాణ రాష్ట్ర గోరక్ష దళ్ మెంబర్ రాఘవేందర్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శాస్త్రీయంగా, విజ్ఞానంగా, సనాతనంగా మన దేశ సంస్కృతి సంప్రదాయ లను, పద్దతులను వదిలేసి అశాస్త్రీయతకు ఆధారమైన విదేశీ పద్ధతులకు యువత అలవాటు పడుతున్నా రన్నారు. ఆంగ్ల సంవత్సరం డిసెంబర్ 31వచ్చిదంటే యువత పబ్బుల్లో, ఫాం హౌస్లో అర్ధరాత్రి వరకు మద్యం మత్తులోమునిగి తేలుతూ ఇతర చెడు వ్యసనాలకు బానిసలై తల్లిదండ్రు లకు చెడ్డ పేరు తెస్తు న్నారన్నారు. రోడ్డు ప్రమాదాలలకు గురై తల్లిదండ్రులకు తీరని వేదన కలిగిస్తున్నారని చెప్పారు. మనది కాని ఈ సంస్కృతి మన ప్రాణాల మీదికి తెస్తుందని దీనిని వీడాలని చెప్పారు. వైజ్ఞానికంగా ప్రకృతి సహజంగా మానవాభివృద్ధికి ఆధారంగా ఉన్న మన ఉగాది పండుగ నూతన సంవత్సరంలాగ జరుపుకోవాలని తెలిపారు.

## ప్రజావాణికి 72 దరఖాస్తులు

**సంగారెడ్డి, డిసెంబర్ 30 డైలీ రిపోర్ట్:** జిల్లాలో ప్రజల నుండి ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నదని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలోనిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 72 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు సమర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల్ని ప్రభావవంతంగా పరిష్కరించటమే ప్రభుత్వ అధికారుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు సకాలంలో న్యాయం పొందేందుకు ఈ కార్యక్రమం మంచి వేదికగా మారిందని పేర్కొన్నారు. అందిన దరఖాస్తులన్నింటినీ తక్షణమే పరిశీలించి, సంబంధిత అధికారులు సత్వర పరిష్కారం అందించవలసిందిగా సూచించారు. ప్రజల న్యాయమైన అభ్యర్థనలు, ప్రభుత్వ పరిపాలనలో మరింత పారదర్శకత తీసుకురావడంలో ప్రజావాణి కీలకమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.ఈ రోజు కార్యక్రమంలో అందిన దరఖాస్తుల సంఖ్య 72 కాగా, వాటి లో రెవిన్యూ శాఖ: 24,సర్వే మరియు ల్యాండ్ రికార్డు: 09,పంచాయతీ రాజ్ శాఖ: 09,డిఆర్డిఓ (గ్రామీణ అభివృద్ధి): 07,మునిసిపల్: 04, వివిధ సంక్షేమ శాఖలు: 09,ఇతర శాఖలు:10 దరఖాస్తుల స్వరూపం అందాయని పేర్కొన్నారు. ప్రజల ప్రధాన సమస్యల పై అధికారులు దృష్టి సారించి సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సిబ్బంది ప్రజల వినతుల స్వీకరణ, సమస్యల నమోదు ప్రక్రియను సజావుగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డి.ఆర్.ఓ పద్మజ రాణి, ఆర్.డి.ఓ రవీందర్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# 'ఆర్ఆర్ఆర్ బిహైండ్ అండ్ బియాండ్'

## మేకింగ్ టీమ్‌ను అభినందించిన రాజమౌళి

'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' కోసం వర్క్ చేసిన టీమ్‌ను ఉద్దేశించి అభినందిస్తూ..దర్శకుడు రాజమౌళి తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. టీమ్ పనితనాన్ని ఆయన మెచ్చుకున్నారు. అందరూ అద్భుతంగా పని చేశారని అన్నారు. 'దాదాపు 13 ఏళ్ల క్రితం ప్రదీప్‌ను కలిశా. ఒక అభిమానిగా అతడు నాకు అప్పుడు తెలుసు. ఈరోజు ప్రదీప్‌తోపాటు వాల్స్ అండ్ ట్రెండ్స్‌లోని అతడి టీమ్ 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' కోసం ఎంతో వర్క్ చేశారు. మరో ఫ్యాన్ గర్ల్ శిరీష, వంశీ మంచి టాలెంట్ ఉన్న ఎడిటర్లు. 20టీబీ డేటాలో సరైన ఫుటేజ్‌ను కనుగొనడం అంత సులభమైన విషయం కాదు. సినిమా కంటే డాక్యుమెంటరీ చాలా ఎమోషనల్‌గా ఉందని వస్తోన్న ప్రశంసలే వారి ప్రతిభకు నిదర్శనం. టీమ్ విషయంలో చాలా గర్వంగా ఉన్నా. వీళ్లందరూ మరెన్నో ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరుకుంటున్నా' అని రాజమౌళి పేర్కొన్నారు. భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచదేశాలకు వ్యాప్తి చేసిన చిత్రం 'ఆర్ఆర్ఆర్' . రామ్‌చరణ్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఈ చిత్రం 2022లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు రాబట్టిన విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ (నాటు నాటు పాటకు) అవార్డు కూడా సొంతం చేసుకుంది. ఈ సినిమా చిత్రీకరణ విశేషాలను తెలియజేస్తూ ఇటీవల చిత్రబృందం 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' అనే డాక్యుమెంటరీ సిద్ధం చేసింది. తాజాగా ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైంది. సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ, షూటింగ్‌లో చోటుచేసుకున్న సరదా మూమెంట్స్, నటీనటులు, దర్శక నిర్మాతల అనుభవాలతో ఈ డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది. దీనిని చూసిన ప్రతిఒక్కరూ టీమ్‌ను ఎంతగానో మెచ్చుకుంటున్నారు. సినిమాతో పోలిస్తే డాక్యుమెంటరీ ఎంతగానో మనసుని హత్తుకుందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా, డాక్యుమెంటరీ విభాగంలో ఇది కనుక ఆస్కార్‌కు వెళితే తప్పకుండా అవార్డు వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# మహేశ్‌బాబు మూవీలో ప్రియాంక చోప్రా

మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఓ చిత్రంలో ప్రియాంక చోప్రా ఛాన్స్ కొట్టేసింది. ఎంబి29'గా ఇది ప్రచారంలో ఉంది. ప్రస్తుతం సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఇదీ ఒకటి. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్‌డేట్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్నట్లు గతంలో వార్తలు జోరుగా ప్రచారం అయ్యాయి. ఇప్పుడు మరో నటి పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెతో చర్చలు జరిపినట్లు టాక్ వినిపిస్తుంది. ఇందులో హీరోతోపాటు హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని ప్రియాంక అయితే ఆ పాత్రకు న్యాయం చేయగలదని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెను తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రియాంక కూడా ఈ సినిమాలో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారట. ఈ పాత్ర కోసం ఇప్పటికే ఆమె ప్రిపరేషన్ కూడా మొదలుపెట్టారట. ఇక ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.





# బేబీ బంప్ ఫోటోలతో సామ్ హల్‌చల్

టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఏమాయ చేశావే చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈ సుందరి.. అతి కొద్ది రోజుల్లోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం మంచి ఫామ్‌లో ఉండగానే టాలీవుడ్ నటుడు నాగచైతన్యను ప్రేమపెళ్లి చేసుకుంది. ప్రస్తుతం అతడితో విడాకులు తీసుకుని సింగిల్‌గా ఉంటోంది. ఈ క్రమంలో సమంతకు సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట షేక్ చేస్తున్నాయి. ఆ ఫొటోల్లో సామ్ బేబీ బంప్ తో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అయితే, అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవిగా తెలిసింది. ఏఐ సాయంతో సమంత బేబీ బంప్ ఫొటోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇవి కాస్తా వైరల్ కావడంతో నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. నాగచైతన్యతో విడాకుల అనంతరం మాతృత్వాన్ని అనుభవించాలని ఉందంటూ సామ్ అప్పట్లో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బేబీ బంప్ ఫొటోలు చూసిన వారంతా ఈ విషయాన్నే గుర్తు చేసుకుంటున్నారు.

# మార్కో తెలుగు ట్రైలర్ విడుదల




ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా హనీఫ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' ఇటీవల మలయాళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. రూ.30కోట్లతో నిర్మించిన ఈ చిత్రం విడుదలైన వారంలో రోజుల్లోనే రూ.80కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు లెక్కగట్టాయి. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ విడుదలైంది. యాక్షన్ సన్నివేశాలను పెద్ద పీట వేసినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.




# పుష్ప-2 నుంచి షెకావత్ పాట విడుదల

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'పుష్ప 2 ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయిక నటించింది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వరల్డ్ వైడ్‌గా రూ.1700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది ఈ చిత్రం. అయితే ఈ మూవీ నుంచి ఫుల్ వీడియో సాంగ్‌లను ఒక్కొక్కటిగా వదులుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'పుష్ప రాజ్' సాంగ్‌తో పాటు 'దెబ్బలు పడతాయ్ రో.. దెబదెబ్బలు పడతాయ్ రో.. కిస్ కిస్ కిస్సిక్' సాంగ్‌లను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మూవీలో ఇంటర్వెల్ ముందు వచ్చే దమ్ముంటే పట్టుకోరా షెకావత్ పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్ అనే సాంగ్‌ను విడుదల చేసింది. థియేటర్‌లో ఉగ్రుతలు ఊగించిన ఈ సాంగ్ విడుదలయ్యింది.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707